పకడ్బందీగా నామినేషన్ల స్వీకరణ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

వీసీ ద్వారా సమీక్షిస్తున్న ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, కలెక్టరేట్ నుంచి హాజరైన అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, అధికారులు

కలెక్టరేట్, ఏప్రిల్ 17: లోక్ సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ, పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఈ నెల 26లోగా తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ ఓటర్ స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌పై అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. స్లిప్పుల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎక్కడి నుంచి ఫిర్యాదులు రావద్దన్నారు. ఈ నెల 18 న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, 18 నుంచి 25 వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్కులు కేటాయించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంత వరకు ప్రత్యేక ఎంట్రీ ఎగ్జిట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రాఫీ, ఫొటోగ్రఫీ జరగాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణపై ప్రతి రోజూ నివేదికలు సమర్పించాలన్నారు. ప్రతి రోజూ దాఖలైన నామినేషన్, అభ్యర్థుల అఫిడవిట్‌లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీసీకి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్ హాజరయ్యారు.

హనుమాన్ దీక్షాపరుల పాదయాత్ర

కోనరావుపేట, ఏప్రిల్ 17: మండల కేంద్రం నుంచి బుధవారం హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. హనుమాన్ దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లారు. ఇక్కడ రమణారెడ్డి, కే రాజు, జితేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

నేటి కోదండ రామస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట, ఏప్రిల్ 17: మల్కపేటలో చల్మెడ కుటుంబ సభ్యులు ₹5కోట్లతో నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 21న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో తన బృందంతో పూజలు చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని చల్మెడ కుటుంబ సభ్యులు కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

మానకొండూర్, ఏప్రిల్17: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని మానకొండూర్ అగ్నిమాపక అధికారి భూదయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం మండల కేంద్రంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ గోపాల్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏరియా దవాఖాన, పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో రూపొందించిన వాల్ పోస్టర్లను ఆయా చోట్ల అంటించారు.

వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి, ఏప్రిల్ 17: శాలపల్లిలోని రామాలయం ప్రాంగణంలో బుధవారం మంచిర్యాలకు చెందిన డా.అనంతరెడ్డి క్రిటికల్ కేర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు లోక్‌సాయినాథ్‌రెడ్డి, సురేశ్‌నాయక్, శ్రీమల్లి తదితలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ప్రతి రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్, తదితరులు

- ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్
- వెల్దిలో ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమం షురూ

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 17: ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ బోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు చేపట్టిన దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ బుధవారం వెల్ది గ్రామంలో ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల సౌకర్యం కోసం ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రికి దేశ వ్యాప్తంగా కోటి ఉత్తరాలు రాసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమినిస్టర్ ఆఫీస్, 152సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 చిరునామాకు ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లో సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, సీనియర్ సిటిజన్స్ దాదాపు 200 మంది ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. సాధన సమితి కరీంనగర్ జిల్లా కన్వీనర్ వెనగంటి చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుంక సందీప్, బొమ్మిడి రమేశ్, పూలు శ్రీధర్, గాడిపల్లి శ్రీనివాస్, అన్నలదాసు రఘుపతి, సుంక మల్లయ్య, కొండా చంద్రమౌళి, సంతోష్, మహేందర్, సుంక చందు, మెరుగు శ్రీనివాస్, వడ్డే సీతారామయ్య, కొడుమూరి పుల్లయ్య, వీరభద్రయ్య, ప్రమీల, నాగయ్య, రాములు, సీనయ్య, లక్ష్మి, కోటమ్మ తదితరులు ఉన్నారు.

మేకను కాపాడబోయి.. మృత్యుఒడిలోకి..

- ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి
- ఎల్లారెడ్డిపేటలో విషాదం

సాయికృష్ణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17: కుటుంబానికి అండగా నిలుస్తున్న కొడుకు చెరువులో శవమై తేలిండు. నీళ్లల్లో పడ్డ మేకను కాపా డేందుకు వెళ్లి మృత్యుఒడికి చేరాడు. చెరువు గట్టున విగతజీవిగా మారిన కొడుకును చూసి తల్లిదండ్రులు రోదించిన తీరు ప్రతిఒక్కరినీ కన్నీళ్లు పెట్టించింది. ఎల్లారెడ్డిపేటలో శ్రీరామనవమి పండుగ పూట ఈ విషాద ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన మిర్యాల్‌కార్ కిషన్-లక్ష్మీబాయికి ముగ్గురు కొడుకులు సాయికృష్ణ(23), వినీత్, దేవీలాల్ ఉన్నారు. వీరు వృత్తిరీత్యా మాంసం విక్రయిస్తుంటారు. ఇందుకోసం మేకలను కొనుగోలు చేసి వాటిని మేతకు తీసుకెళ్తారు. తండ్రి దివ్యాంగుడు కావడంతో పెద్దకొడుకైన సాయికృష్ణ అన్ని పనులు చూసుకొనేది. ఈ క్రమంలో బుధవారం ఉదయం సాయికృష్ణ తండ్రి కిషన్‌తో కలిసి మేకలు మేపేందుకు గిద్దె చెరువు సమీపంలోకి వెళ్లారు. మందలోని ఒక మేక చెరువులోని నీళ్లల్లోకి వెళ్లడంతో రక్షించేందుకు సాయికృష్ణ చెరువులోకి దిగాడు. చెరువు గట్టు మీద ఉన్నవారు వారిస్తున్న వినకుండా లోతులోకి వెళ్లాడు. ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. దీంతో గట్టుపైనున్న కొత్త రాజు, కుంచెపు రవి, గౌరీశంకర్ చెరువులో దిగి వెదుకగా మృతదేహం దొరికింది. పండుగ పూట కొడుకు మరణంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. పోలీసులు జరిగిన ఘటనపై వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల దవాఖానకు తరలించారు.

యువకుడి బలవన్మరణం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: అప్పుల బాధతో ఓ యువకుడు ఉరేసుకొని మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని సంగెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనిగరపు మహేశ్(30) గల్ఫ్ వెళ్లేందుకు బంధువుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మహేశ్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

చందుర్తి: సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ఇల్లంతకుంట: రామాజీపేటలో రాములోరి కల్యాణోత్సంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ

కోనరావుపేట: మామిడిపల్లిలో రాములోరిని దర్శించుకుంటున్న జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు అరుణ, మాధవి

కల్యాణం.. కమనీయం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- రామనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

వేములవాడ టౌన్: స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ)/ వేములవాడ టౌన్: శ్రీరామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని సీతారాములను దర్శించుకున్నారు. జైశ్రీరాం.. రామలక్ష్మణ జానకీ.. జైబోలో హనుమాన్ కీ.. అనే నామస్మరణతో ఊరువాడా పులకించిపోయింది. కోనరావుపేట మండలం మామిడిపల్లి, గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలోని రాములోరి కల్యాణోత్సవాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గంభీరావుపేటలో రాములోరి కల్యాణోత్సవాన్ని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, కోనరావుపేట మండలం మామిడిపల్లిలో వేడుకలకు వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి హాజరయ్యారు. చందుర్తి, రుద్రంగి మండలాల్లోని పలు గ్రామాల్లో హనుమాన్ రాములోరి కల్యాణోత్సవానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇల్లంతకుంట మండలం రామాజీపేటలో రాములోరి కల్యాణోత్సవంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ పాల్గొని పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని గాంధీ నగర్ హనుమాన్ ఆలయంలో కాలభైరవ స్వామివారిని దర్శనానికి భక్తులు తరలివచ్చారు. విద్యానగర్‌లోని హనుమాన్ ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలో రాములోరి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తంగళపల్లి, బోయినపల్లి, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

వేములవాడ రాజన్న ఆలయంలో..

వేములవాడ రాజన్న ఆలయంలో స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో వైష్ణవ పురోహితులు, ప్రధాన అర్చకులు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పాల్గొన్నారు. కల్యాణమహోత్సవం తర్వాత స్వామివార్లు సాయంత్రం రథంపై విహారం చేశారు. దారిపొడుగునా హిజ్రాలునృత్యం చేస్తూ భక్తులను ఆనందడోలికల్లో ముంచివేశారు. దారిపొడుగునా భక్తులు జగదభిరామునికి హారతులిచ్చి నీరాజనం పలికారు.

వేములవాడ టౌన్: రాజన్న ఆలయంలో స్వామివారిపై అక్షింతలు వేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట: సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్: రాములోరి కల్యాణ వేడుకల ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

వేములవాడ టౌన్: వేములవాడ రాజన్న ఆలయంలో కల్యాణాన్ని తిలకిస్తున్న శివపార్వతులు, భక్తులు

బస్వాపూర్‌లో కంకర తేలిన రోడ్డుపై ఇబ్బందిపడుతూ వెళ్తున్న వాహనదారులు

కంకర రోడ్డుపై వెళ్లేదెలా?

- బస్వాపూర్‌లో రోడ్డు పనులు జాప్యం
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు

తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో రోడ్డు పనుల జాప్యంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. బద్దెనపల్లి-రామోజీపేటకు డబుల్ రోడ్డు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. బస్వాపూర్‌లో బీటీ రోడ్డును తొలగించగా, కంకరతేలి ప్రయాణం కష్టతరంగా మారింది. తేలిన కంకరతో వాహనదారులు, గ్రామస్తులు అవస్థులు పడుతున్నారు. బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని బస్వాపూర్ నుంచి రామోజీపేటకు ఇతర మండలాల నుంచి వెళ్లారు. బస్వాపూర్‌లో కంకర రోడ్డుతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు.

- సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న స్వామిగౌడ్

వివాహ వేడుకకు రండి

ముస్తాబాద్ ఏప్రిల్ 17: మద్దికుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు స్వామి గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశాడు. తన కుమారుడు సందీప్‌గౌడ్ వివాహ వేడుకకు రావాలని రామన్నకు ఆహ్వాన పత్రిక అందించాడు. ఇక్కడ బాదవేని స్వామిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

అనిల్‌రావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

చందుర్తి, ఏప్రిల్17: బీఆర్ఎస్ సీనియర్ నేత, మూడపల్లి మాజీ సర్పంచ్ జువ్వాడి అనిల్‌రావు తల్లి అంజలిదేవి ఇటీవల మృతి చెందగా, బుధవారం బాధిత కుటుంబాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇక్కడ మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ సర్పంచ్ సంటి బాబురావు, నాయకు లు బొప్ప వెంకన్న, నీరటి శ్రీనివాస్, కొమ్ము శంకర్, బద్ధం బాపురెడ్డి ఉన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

చందుర్తి, ఏప్రిల్ 17: మోయినికుంట మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని ఆయా గ్రామాల రైతులు, ప్రయాణికులకు ఎంపీపీ బైరగోని లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆమె వెంటనే స్పందించారు. మూడపల్లి గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులకు సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో బుధవారం ఎక్స్‌కవేటర్ సాయంతో మూడపల్లి నుంచి నర్సింగాపూర్‌కు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. ఇక్కడ గౌడ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి బైరగోని రమేశ్ గౌడ్, బాపురెడ్డి, దామోదర్ శివప్రసాద్, నాయకులు, తదితరులు ఉన్నారు.

చోరీకి పాల్పడిన నలుగురి అరెస్ట్

కథలాపూర్, ఏప్రిల్ 17: మండలంలోని తక్కళ్లపెల్లిలో నక్క సతీశ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోదన్ పట్టణానికి చెందిన ఒడిబిడి పోశెట్టి, అతని భార్య లక్ష్మి, బింగి గంగామణి, ఆటో డ్రైవర్ జావేద్‌ఖాన్ ఈనెల 15న తక్కళ్లపెల్లిలో సతీశ్ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. సతీశ్ ఫిర్యాదు మేరకు నిఘా పెట్టగా.. బుధవారం అనుమానాస్పద స్థితిలో నలుగురు వ్యక్తులు పోలీసులకు కనిపించారు. వారిని అదుపులోకి విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ. 3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ వివరించారు.

భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తా

జగిత్యాల, ఏప్రిల్ 17: రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని తెలి పారు. అంతర్గాం నుంచి జాతీయ రహదారి 563 నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు సర్వే చేశామని, గ్రామంలో 45కు పైగా ఇండ్లు, 100 మందికి పైగా రైతులు భూములు కోల్పోయే అవకాశం ఉందన్నారు. గ్రామం పక్క నుంచే నేషనల్ హైవే వెళ్తున్నందున జగిత్యాల, మేడిపల్లి, మల్యాల, కొండగట్టు వరకు రద్దీ ఉండడంతో అంతర్గాం వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలన్నారు. అండర్ పాస్‌లు నిర్మించాలని, మళ్లీ రీసర్వే చేసి, 100 ఫీట్లు మించకుండా చూడాలన్నారు. ఎక్కువ భూములు పోకుండా రైతులు, ప్రజలకు తక్కువ నష్టం జరిగేలా చూడాలని అధికారులను కోరారు.

సొంత గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్

కోరుట్ల, ఏప్రిల్ 17: పట్టణానికి చెందిన 20 వార్డు కౌన్సిలర్ గందం గంగాధర్ తిరిగి సొంత గూటికి చేరారు. వారం క్రితం కాంగ్రెస్‌లో చేరిన ఆయన బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, ఆయనకు ఎమ్మెల్యే సంజ య్ కల్వకుంట్ల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాను తిరిగి బీఆర్ఎస్‌లోకి రావడం సంతోషంగా ఉందని, తనకు రాజకీయ జీవితాన్ని అందించిన మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు రుణపడి ఉంటానని గంగాధర్ తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల వెంట నడుస్తానని ఉద్ఘాటించారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, పేర్ల సత్యం, సజ్జు, యాటం అరుణ్, మురళి, రఫీ, బాబా, తదితరులున్నారు.